
TGTEL/25/A1907

# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 193 ఎడిటర్ : సింగిడి అమృత్, తెలంగాణ శనివారం.07.02.2026 పేజీలు : 8, వెల:రూ.2.00

PUBLISHED FROM ADILABAD,NIRAML,MANCHIRAL,KOMARAMBHEEM, ASIFABADKARIMNAGAR,JAGITIYALA,PEDAPALLI,JAI SHANKA BHUPALLI, NIZAMABAD,KAMAREDDY,MEDCHEL,HYDERABAD




# ఏం చేశారని ఓట్లడుగుతున్నారు?

నిజామాబాద్ :అమృత్ తెలంగాణ: 'బీజేపీకి ఎందుకు ఓటు వేయాలి. మూడుసార్లు మోడీ ప్రధాని అయినా నిజామాబాద్‌ను స్మార్ట్ సిటీ చేయలేకపోయారు. రాష్ట్రంలో బీజేపీ నుంచి ఎనిమిది మంది ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్నా మెట్రో విస్తరణకు, ఔటర్ రింగురోడ్డు విస్తరణకు, మూసీ ప్రక్షాళనకు కేంద్రం నుంచి నిధులు తీసుకు రాకుండా అడ్డుకుంటున్నారు. ఏం తెచ్చారని, ఇచ్చారని ఓట్లు అడుగుతున్నారు.' అని కేంద్ర మంత్రులను, బీజేపీ ఎంపీలను, బీజేపీ నేతలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రశ్నిం చారు. 'మున్సిపల్ మంత్రిగా నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు ఉమ్మడి జిల్లాలోని ఏడు మున్సిపాల్టీల అభివృద్ధికి రూ.1045 కోట్ల నిధులు ఖర్చు చేస్తున్నాం.

పదేండ్లు బీఆర్ఎస్‌కు, పన్నెండేండ్లు బీజేపీకి అధికారం ఇచ్చినా.. మున్సిపాల్టీలు మురికి కూపంగానే ఉన్నాయి. గల్లీల్లో మోరీలు తీయాలంటే ఢిల్లీ నుంచి మోడీని పిలవాలా..? 'గాడిదకు గడ్డి వేసి ఆవు నుంచి పాలు పిండటం సబబా? బీఆర్ఎస్, బీజేపీకి ఓట్లు వేసి అభివృద్ధి పనులు కాంగ్రెస్ చేయాలంటే సాధ్యమా..? ఇప్పుడు మంచి అవకాశం వచ్చింది. స్థానికంగా మనోడే ఉండాలే. నిజామాబాద్ కార్పొరేషన్‌తో పాటు ఏడు మున్సిపాల్టీల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలి' అని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. మోడీ వద్ద పరపతి ఉందని చెప్పుకునే ఎంపీ అరవింద్ నిజామాబాద్‌ను ఎందుకు స్మార్ట్ సిటీగా ఎంపిక చేయలేదని ప్రశ్నించారు. ఆయన వద్ద పరపతి లేదని అర్థమవుతోందని అన్నారు. నిజామాబాద్ ఔటర్‌రింగ్ రోడ్డుకు నిధులిస్తే తాము వద్దన్నామా..? అని ప్రశ్నించారు.

నిజామాబాద్ జిల్లాకు మంజూరైన మూడు ఇంటిగ్రేటెడ్ స్కూళ్లకు, తెలంగాణ యూనివర్సిటీలో పలు అభివృద్ధి పనులకు శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి.. మంత్రు లు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, టీపీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్, ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్‌రెడ్డి, షబ్బీర్‌అలీతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం బర్దిపూర్ శివారులో రూరల్ ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన 'ప్రజాపాలన- ప్రగతిబాట' బహిరంగసభలో ప్రసంగించారు. నిజామాబాద్ జిల్లాకు గొప్ప చరిత్ర ఉందని.. ఖిల్లా జైలు గోడల మీద దాశరథి 'నా తెలంగాణ కోట రతనాల వీణ' అని నినదించారని, ఇక్కడి రైతులు పోరాట పటిమ గలిగిన వారని, చైతన్యవంతులని, జిల్లా రైతుల వ్యవసాయం దేశానికే ఆదర్శమని అన్నారు. ఇక్కడి రైతుల పక్షాన పోరాటం చేయడంతో కాంగ్రెస్ అధిష్టానం దృష్టిలో పడి సీఎం అయ్యానని, తన మనుసులో నిజామాబాద్‌కు ప్రత్యేక స్థానం ఉన్నట్టు వెల్లడించారు. నిజామాబాద్ జిల్లాకు అత్యధిక నిధులు మంజూరు చేయడానికి శాయశక్తులా ప్రయత్నిస్తానని తెలిపారు.

కిషన్‌రెడ్డి ఎక్కడా..?

కాంగ్రెస్ హయాంలో కట్టిన ఎస్సారెస్పీ ఇప్పటికీ ధృడంగా ఉండి పంటలకు నీరందిస్తోందని, కానీ గోదావరి జలాల పేరుతో తెలంగాణను కొల్లగొట్టారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. 'కేసీఆర్, హరీశ్‌రావును జైలులో పెట్టి చిప్పకూడు తినిపించాలని ధర్మపురి అర్వింద్ అంటుంటా రని, కాళేశ్వరం బీఆర్ఎస్ పార్టీకి ఏటీఎంగా మారిందని, సీబీఐకి కేసు అప్పగిస్తే 48 గంటల్లో కేసీఆర్‌ను అరెస్టు చేస్తామని పలికిన కిషన్‌రెడ్డి ఎక్కడ దాక్కున్నారని ముఖ్య మంత్రి ప్రశ్నించారు. సీబీఐకి ఇచ్చి ఆరు నెలలవుతున్నా అరెస్టు చేయనీయకుండా ఎందుకు అడ్డుకుంటున్నారని అడిగారు. ఈ విషయంలో ధర్మపురి అర్వింద్ ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. శాసనసభలో చర్చ పెట్టి కాళేశ్వరాన్ని సీబీఐకి ఇచ్చాం...ఇప్పటి వరకు సీబీఐ పట్టించుకోలేదన్నారు. కిషన్‌రెడ్డి కేసీఆర్‌ను ఏ రకంగా కాపాడుతున్నాడో తెలియడం లేదా..? అని అన్నారు.



కేసీఆర్ దత్తపుత్రుడు.. కిషన్‌రావు


'నీ పక్కన కూసున్న కిషన్‌రెడ్డి కేసీఆర్‌ను కాపాడుతున్నాడు. అసలు ఎందుకు కాపాడుతున్నాడో అడుగు. కల్వకుంట్ల కిషన్‌రావు అయ్యాడు. కేసీఆర్‌కు దొంగపుత్రుడు కేటీఆర్ ఉంటే.. దత్తపుత్రుడు 'కిషన్‌రావు' అని ఆయనను జనజీవన స్రవంతిలోకి తీసుకురావాలి' అని సీఎం రామచంద్రారావుకు సూచించారు. 70 వేల ఉద్యోగాలు కల్పించామని, ఎల్‌బీ స్టేడియానికి వస్తే 70 వేల తలలు లెక్కపెట్టుకోవచ్చని హితవు పలికారు. గ్రూప్-1పై హైకోర్టు తీర్పు బీఆర్ఎస్‌కు చెంపపెట్టని అన్నారు. 562 మందికి నియామకపత్రాలు అందజేస్తామని తెలిపారు. మున్సిపాల్టీ ల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేద్దామని అన్నారు. 2029లో సీఎంగా నేను, పీసీసీ అధ్యక్షుడిగా మహేశ్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌పార్టీని మళ్లీ అధికారంలోకి తెస్తామని ధీమా వ్యక్తం చేశారు.

రేవంత్‌రెడ్డి మాదిగ.. రేవంతుద్దీన్.. అన్నా స్వీకరిస్తా

'బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు నన్ను రేవంతుద్దీన్ అని సంభోదించారు. సంతోషమే. బ్రిటీష్ కాలం పరిపాలన అనంతరం వందేండ్ల తర్వాత దేశంలో ఏ రాష్ట్రం చేయలేని విధంగా కులగణన చేపట్టి బీసీ జనాభా లెక్కలు తీస్తే టీపీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్ గౌడ్ నన్ను రేవంత్‌గౌడ్‌గా అభివర్ణిస్తే స్వీకరించా. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం 100 రోజుల్లో ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ చేపట్టి 40 ఏండ్ల సమస్యను పరిష్కరిస్తే.. మంత్రి దామోదర రాజనర్సింహ రేవంత్ మాదిగ అని పిలిస్తే సంతోషమనిపించింది.

30 ఏండ్లుగా కార్యకర్తగా పనిచేసిన వాకటి శ్రీహరికి ఎమ్మెల్యే, మంత్రి పదవి అప్పగిస్తే రేవంత్ ముదిరాజ్ అన్నారు. అనిల్‌కుమార్ యాదవ్‌ను రాజ్యసభకు పంపితే నన్ను రేవంత్ యాదవ్ అంటూ అక్కున చేర్చుకున్నారు. స్వర్ణ దేవాలయాన్ని నిర్మిస్తానన్నందుకు నన్ను సర్దార్ రేవంత్‌సింగ్ అని సిక్కు సోదరులు పిలిచారు. ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్‌లు కల్పించాం. సీటు త్యాగం చేసి ఓడి పోయిన షబ్బీర్‌అలీకి పదవి ఇచ్చా. అజారుద్దీన్‌ను మంత్రిని చేశా. కాబట్టి రేవంతుద్దీన్ అని పిలిచినా పర్వాలేదు. కులాలను, మతాలను సమన్వయం చేసుకుంటూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథం వైపు తీసుకెళ్తున్నా' అని సీఎం వ్యాఖ్యానించారు.

# పార్టీ ఫిరాయింపులపై డెడ్‌లైన్



న్యూఢిల్లీ :అమృత్ తెలంగాణ: పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేల అంశంలో నిర్ణయం తీసుకునేందుకు సుప్రీంకోర్టు స్పీకర్‌కు మరో మూడు వారాల సమయం ఇచ్చింది. అప్పటికీ నిర్ణయం తీసుకోకపోతే కోర్టు ధిక్కార చర్యలపై ఆలోచన చేస్తామని హెచ్చరించింది. బీఆర్ఎస్ బీ ఫారం నుంచి కారు గుర్తుపై గెలిచిన శాసన సభ్యులు దానం నాగేందర్, తెల్లం వెంకట్రావ్, కడియం శ్రీహరి పార్టీ ఫిరాయించారని పాడి కౌశిక్ రెడ్డి, కేపీ వివేకానంద్ సుప్రీంకోర్టులో గతేడాది జనవరి 15న స్పెషల్ లీవ్ పిటిషన్(సివిల్) దాఖలు చేశారు. అదేరోజు ఎమ్మెల్యేలు పరిగి శ్రీనివాస్ రెడ్డి, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, కాలే యాదయ్య, టీ ప్రకాశ్ గౌడ్, అరికెపూడి గాంధీ, గూడెం మహిపాల్ రెడ్డి, ఎం సంజయ్ కుమార్ పార్టీలు ఫిరాయించారని కేటీఆర్, పాడి కౌశిక్ రెడ్డి, కేపీ వివేకానంద్, జగదీశ్ రెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, చింత ప్రభాకర్, కల్వకుంట్ల సంజయ్ సుప్రీంలో రిట్ పిటిషన్(సివిల్) వేశారు.

ఆ తర్వాత వాదనలు జరుగుతుండగానే మార్చి 18న బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి స్పెషల్ లీవ్ పిటిషన్(సివిల్) దాఖలు చేశారు. దానం నాగేందర్‌ని ప్రతివాదిగా చేర్చారు. ఈ అన్నీ పిటిషన్లపై గతంలో సీజేఐ ధర్మాసనం విచారణ జరిపి గత జులై 31 వరకు ఫిరాయింపులపై చర్యలు తీసుకోవాలని స్పీకర్ కార్యాలయాన్ని ఆదేశించారు. అయితే... స్పీకర్ కార్యాలయం ఈ మూడు నెలల కాలం ముగించే సమయానికి.. మరింత గడువు కావాలని సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఇదే సందర్భంలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై కోర్టు ధిక్కార పిటిషన్‌తో పాటు, మరో పిటిషన్ దాఖలు చేశారు. అలాగే పాడి కౌశిక్ రెడ్డి, ఇతరులు మిస్ లీనియస్ అప్లికేషన్లు వేశారు. ఈ పిటిషన్లపై శుక్రవారం జస్టిస్ సంజయ్ కరోల్ నేతృత్వంలోని జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసీహ్ ద్విసభ్య ధర్మాసనం మరోసారి విచారణ జరిపింది. స్పీకర్ కార్యాలయం తరపు సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ, పిటిషనర్లు కేటీఆర్, పాడి కౌశిక్ రెడ్డి, ఇతరుల తరపున ఏఓఆర్ మోహిత్ రావు హాజరయ్యారు.

పదింటిలో ఎనిమిది పరిష్కారం

తొలుత స్పీకర్ తరపున సింఘ్వీ వాదనలు వినిపిస్తూ.. మొత్తం పది అనర్హత పిటిషన్లలో ఎనిమిదింటిని స్పీకర్ పరిష్కరించారని కోర్టుకు నివేదించారు. గత విచారణ తరువాత జరిగిన పురోగతిని ధర్మాసనానికి నివేదించారు. ప్రస్తుతం మున్సిపల్ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఎమ్మెల్యేలు కొంత సమయం అడిగారని తెలిపారు. అందువల్ల మిగిలిన రెండు పిటిషన్ల పరిష్కారానికి మరో మూడు వారాల సమయం కావాలని కోరారు. మార్చి నెల మధ్యలోగా మిగిలిన వాటిపై స్పీకర్ నిర్ణయం తీసుకుంటారని కోర్టుకు వివరించారు.

అప్పుడు ఆలోచిస్తాం

స్పీకర్ తరపు అభ్యర్థనపై పిటిషనర్ల తరపు న్యాయవాది మోహిత్ రావు అభ్యంతరం తెలిపారు. ఇప్పటికే చాలా ఆలస్యం జరిగిందని కోర్టుకు దృష్టికి తీసుకెళ్లారు. దాదాపు 16 నెలలుగా ఈ కేసు నడుస్తోందని, ఉద్దేశపూర్వకంగానే విచారణలో తీవ్ర జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. 'ఒక ఎమ్మెల్యే గెలిచిన ఆరు నెలలకే పార్టీ ఫిరాయించి, కాంగ్రెస్ గుర్తుపై ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. పార్టీ ఫిరాయించిన మరో ఎమ్మెల్యే కుమార్తె కాంగ్రెస్ నుంచి ఎంపీగా పోటీ చేస్తే సంబంధిత ఎమ్మెల్యే ప్రచారం చేశారని ఉద్వేగంగా వాదనలు వినిపించారు. వీలైనంత త్వరగా నిర్ణయం తీసుకునేలా చూడాలని ధర్మాసనాన్ని అభ్యర్థించారు.ఈ వాదనలపై స్పందించిన ధర్మాసనం, గత ఆదేశాల ప్రకారం కేసులో పురోగతిని స్పీకర్ కార్యాలయం తెలిపిందన్నారు. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని మరో మూడు వారాలు సమయం ఇస్తున్నట్టు జస్టిస్ సంజయ్ కరోల్ వెల్లడించారు. అప్పటికీ స్పీకర్ కార్యాలయం నిర్ణయం తీసుకోకపోతే, కోర్టు ధిక్కరణ చర్యలపై ఆలోచన చేస్తామని ధర్మాసనం పేర్కొంది. మరోవైపు కోర్టులో జరిగిన వాదనలను సోషల్ మీడియాలో పలువురు న్యాయ వాదులు, ఇతరులు వైరల్ చేస్తోన్న అంశంపై ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది.

# మున్సిపల్ ఎన్నికల్లో రెండు పార్టీలకూ బుద్ధి చెప్పాలి



వేములవాడ :అమృత్ తెలంగాణ: కులం, మతం పేరుతో ఓట్లు అడుగుతున్న బీజేపీ, హామీలను అమలు చేయకుండా మోసం చేసిన కాంగ్రెస్‌కు మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలో శుక్రవారం మున్సిపల్ ఎన్నికల ప్రచార సభలో నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావుతో కలిసి కేటీఆర్ పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ దొంగ హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజల్ని మోసం చేస్తోందని ఆరోపించారు. ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మభ్యపెట్టి, అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క హామీనీ సరిగా అమలు చేయలేదన్నారు. ఎన్నికల సమయంలో వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ బాండ్ పేపర్‌పై రాసి ఆరు గ్యారంటీలను వంద రోజుల్లో అమలు చేస్తానన్న హామీని గుర్తు చేస్తూ.. ఆ బాండ్ పేపర్‌ను సభలో ప్రజల ముందు ప్రదర్శించారు. నాలుగు సార్లు ఓడిపోయానని, ఈసారి ఓటు వేయకపోతే చనిపోతానని సానుభూతి డైలాగులతో ప్రజలను మభ్యపెట్టిన ఆది శ్రీనివాస్.. ఆ తర్వాత అభివృద్ధి గురించి పట్టించుకోలేదని విమర్శించారు.

వేములవాడ నియోజకవర్గానికి ఏం చేశారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ఇన్ని మోసాలు, ద్రోహాల తర్వాత కూడా ఈ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేస్తే, ప్రజలు తమ మోసాలను ఆమోదించినట్టేనని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం భావిస్తోందని అన్నారు. అలా జరిగితే భవిష్యత్‌లో హామీల అమలుపై దృష్టి పెట్టే అవకాశమే ఉండదన్నారు. రూ.4 వేల పెన్షన్, ఆసరా పెన్షన్, రైతు భరోసా, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, తులం బంగారం వంటి హామీలు అమలు కావాలంటే ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా ఓటు వేయాలని పిలుపునిచ్చారు. అప్పుడే తమ మోసాలపై ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారన్న విషయం ప్రభుత్వానికి అర్థమవుతుందని చెప్పారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూడా తెలంగాణకు చేసింది ఏమీ లేదని కేటీఆర్ విమర్శించారు.

ఇదే పార్లమెంట్ నియోజకవర్గం నుంచి రెండుసార్లు ప్రాతినిధ్యం వహించిన కేంద్ర మంత్రి బండి సంజరు చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని ప్రశ్నించారు. ప్రతి ఇంటికీ రూ.15 లక్షలు ఇస్తానన్న ప్రధాని మోడీ హామీ ఏమైందని నిలదీశారు. ఎన్నికలొచ్చినప్పుడల్లా దేవుడి పేరు, కులం, మతం పేరుతో ప్రజలతో ఓట్లు వేయించుకోవడమే బీజేపీ పని అని ఆరోపించారు. బీజేపీ దొంగ మాటలను నమ్మొద్దని, పేదల కడుపులు నింపి తెలంగాణ సాధించిన నాయకుడు కేసీఆర్‌ను గుర్తు పెట్టుకొని బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ ఎన్నికల్లో వేసే ప్రతి ఓటూ మరోసారి కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని చేసే ప్రస్థానానికి తొలి అడుగుగా మారాలని అన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ, మున్సిపల్ అభ్యర్థులు నిమ్మచెట్టి విజయ్, గోలి మహేష్, మారం కుమార్, నరాల శేఖర్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# 9 నుంచి అక్రిడిటేషన్లకు దరఖాస్తులు



హైదరాబాద్ : అమృత్ తెలంగాణ:జర్నలిస్టులు ఈనెల తొమ్మిదో తేదీ నుంచి సమాచార శాఖ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో అక్రిడిటేషన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలంగాణ సమాచార, పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ సిహెచ్ ప్రియాంక తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా యాజమాన్యాలు, వాటిలో విధులు నిర్వర్తించే జర్నలిస్టులకు సూచించారు. జీవోలు 252 ద్వారా అక్రిడిటేషన్ల మార్గదర్శకాలు, జీవో 103 ద్వారా సవరణల వివరాలను తెలియజేస్తూ ఆయా జిల్లాల కలెక్టర్లకు లేఖ రాశారు. జిల్లాల్లో అక్రిడిటేషన్ కమిటీలు ఏర్పడిన తర్వాత అక్రిడిటేషన్లను జారీ చేయాలని కలెక్టర్లకు సూచించారు. తక్షణం అవసరమైన అన్నీ చర్యలు తీసుకోవాలని కోరారు.

# ఉత్తీర్ణతా శాతం పెంచాలి




హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: ఇంటర్‌మీడియట్ , పదోతరగతి పరీక్షల్లో ఉత్తీర్ణతా శాతాన్ని పెంచాలని ఉపాధ్యాయులకు రాష్ట్ర మంత్రి మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. మహాత్మా జ్యోతిబాపూలే గురుకులాల పాఠశాలలపై అధికారులు, ప్రిన్సిపల్‌లు , హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లతో మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం జూమ్ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో బీసీ సంక్షేమశాఖ సెక్రటరీ శ్రీధర్, గురుకులాల సెక్రటరీ సైదులు , గురుకులాల ప్రిన్సిపాల్‌లు , హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు, ఇతర అధికారులు.ఇంటర్‌మీడియట్, పదోతరగతి పరీక్షలు సమీపిస్తుండడంతో విద్యార్థుల సన్నద్ధతకు ఉపాధ్యాయుల ప్రత్యేక కార్యాచరణ అమలు తదితర అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు.

# సచిన్ సావన్ తో ప్రచారంలో పాల్గొన్న బోరంచు శ్రీకాంత్ రెడ్డి



ముస్సిపల్ ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న బోరంచు శ్రీకాంత్ రెడ్డి

అమృత్ తెలంగాణ అదిలాబాద్ న్యూస్ ముస్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి విచ్చేసిన ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావన్ ని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించడం జరిగింది. అనంతరం డీసీసీ అధ్యక్షులు నరేష్ జాదవ్, ఆదిలాబాద్ ఇంచార్జ్ కంది శ్రీనివాస్ రెడ్డి, మాజీ డిసిసి అధ్యక్షులు సాజిద్ ఖాన్, మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, మాజీ మార్కెట్ చైర్మన్ అల్లూరి సంజీవ్ రెడ్డి , డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, బాలూరి గోవర్ధన్‌రెడ్డి గార్లతో కలిసి ముస్సిపల్ పరిధిలోని 13,41,42 వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థుల తరపున ప్రచారంలో పాల్గొనడం జరిగింది.



సచిన్ సావన్ ని కలిసిన సన్మానిస్తున్న బోరంచు శ్రీకాంత్ రెడ్డి

# బ్యాలెట్ పేపర్ల ముద్రణ, వెరిఫికేషన్‌ను పరిశీలించిన కలెక్టర్



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి రాబోయే ఎన్నికల నేపథ్యంలో బ్యాలెట్ పేపర్ల ముద్రణ, వెరిఫికేషన్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ రాజర్షి షా శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. స్థానిక జడ్పీ కార్యాలయంలోని ముద్రణాలయం, స్ట్రాంగ్ రూమ్ వద్ద జరుగుతున్న ఏర్పాట్లను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బ్యాలెట్ పేపర్ల నాణ్యత, అక్షర దోషాలు లేకుండా ముద్రణ జరుగుతున్నదా, భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారా అనే అంశాలను కలెక్టర్ నిశితంగా పరిశీలించారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు చోటుచేసుకోకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ప్రతి దశను నిబంధనలకు అనుగుణంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ తనిఖీలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, డీఆర్‌డీఏ రవీందర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో 100% పోలింగ్ లక్ష్యం: జిల్లా కలెక్టర్ రాజార్షి షా





అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి: మున్సిపల్ ఎన్నికల్లో 100శాతంపోలింగ్ నమోదు లక్ష్యంగా స్వీప్ కార్యక్రమాల ద్వారా ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నామని జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఓటర్లను చైతన్యపరిచేందుకు శుక్రవారం కలెక్టరేట్ ఆవరణలో 'స్వీప్' (రాంఎజుజ్రూ) ఎన్నికల అవగాహన ప్రచార వాహనాన్ని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత కీలకమని, అర్హులైన ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం పెంచేందుకు ఈ ప్రచార వాహనాలు వార్డుల వారీగా తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పిస్తాయని తెలిపారు. ఈ నెల 11వ తేదీన జరగనున్న మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌లో అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. 100 శాతం పోలింగ్ సాధించడమే లక్ష్యంగా స్వీప్ అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీఓ స్రవంతి,మున్సిపల్‌కమిషనర్‌రాజు,స్వీప్ నోడల్ అధికారులు మనోహర్, రాజలింగం, శ్రీనివాస్, కలెక్టరేట్ ఏవో వర్ణ, తహసీల్దార్ శ్రీనివాస్‌తదితరఅధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# క్రీడా రంగాల్లో రాణించడం ద్వారా అనేక ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందవచ్చని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న అదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా



హాజరైన విద్యార్థిని విద్యార్థులు

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి: క్రీడా రంగాల్లో రాణించడం ద్వారా అనేక ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందవచ్చని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని ఎస్సీ వసతి గృహాల విద్యార్థులకు శుక్రవారం స్థానిక ఇందిరా ప్రియదర్శిని క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడా పోటీల ముగింపు కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ పోటీలను ఉదయం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని సూచించారు. క్రీడల్లో ప్రతిభ కనబరిస్తే ఉన్నత స్థాయిలో అవకాశాలు లభిస్తాయని తెలిపారు. జిల్లాలోని 18 వసతి గృహాల నుంచి సుమారు 230 మంది విద్యార్థులు పాల్గొని ఖో-ఖో, కబడ్డీ, వాలీబాల్, చెస్, క్యారమ్స్, రన్నింగ్ తదితర విభాగాల్లో పోటీపడ్డారని పేర్కొన్నారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని అన్నారు. విజేతలను అభినందిస్తూ, ఓటమి చెందిన వారు నిరుత్సాహపడకుండా మరింత కృషి చేయాలని ప్రోత్సహించారు. అనంతరం వివిధ క్రీడా విభాగాల్లో గెలుపొందిన విజేతలకు కలెక్టర్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి సునీత కుమారి, జిల్లా క్రీడా అధికారి శ్రీనివాస్, సహాయ సాంఘిక సంక్షేమ అధికారులు నారాయణ రెడ్డి, నర్సింగ్, వసతి గృహ అధికారులు, సిబ్బంది, క్రీడా ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వంద శాతం పోలింగ్ నమోదు లక్ష్యం:జిల్లా కలెక్టర్ రాజర్షి షా పిలుపు



జెండా ఊపి ప్రారంభిస్తున్న ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా




అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి: ఈ నెల 11 న జరిగే మున్సిపల్ ఎన్నికల పోలింగ్ లో అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును స్వచ్ఛందంగా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శుక్రవారం పట్టణంలో 'స్వీప్' (రాంఎజుజ్రూ) ర్యాలీ, 'స్వీప్ రథం' ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ స్వీప్ అవగాహన ర్యాలీ క్రాంతి నగర్ నుండి హమాలీవాడ సేడ్స్ కార్యాలయం వరకు తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారుల ఆటపాటలతో, ప్రజలకు కర దీపికలను అందజేసి అవగాహన కల్పిస్తూ ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఓటు – ఒక శక్తివంతమైన ఆయుధం

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గారు రాజ్యాంగం ద్వారా మనకు అందించిన అత్యంత శక్తివంతమైన ఆయుధం ఓటు హక్కు అని, 18 ఏళ్లు నిండిన ప్రతి పౌరుడికి, కుల మత భేదం లేకుండా, మహిళలు, పురుషులకు సమానంగా ఓటు హక్కు కల్పించిన ఘనత భారత రాజ్యాంగానిదేనని ఆయన కొనియాడారు. వార్డు, మున్సిపాలిటీ సమస్యల పరిష్కారానికి సరైన నాయకుడిని ఎంచుకోవాల్సిన బాధ్యత ఓటర్ల పైనే ఉందన్నారు. ప్రలోభాలకు లొంగవద్దని, ఓటర్లు ఎవరూ డబ్బు, మద్యం లేదా ఇతర ప్రలోభాలకు లొంగి ఓటు వేయవద్దని విజ్ఞప్తి చేశారు. ప్రలోభాలకు గురై ఓటు వేస్తే, భవిష్యత్తులో నాయకులను ప్రశ్నించే హక్కును కోల్పోతామని, స్వచ్ఛందంగా ఓటు వేసినప్పుడే ఐదేళ్లపాటు ప్రజాప్రతినిధులను అడిగే హక్కు ఉంటుందని అన్నారు. బూత్ స్థాయి అధికారులు ఓటర్ చిట్టీలను తప్పనిసరిగా తీసుకోవాలనీ, అందకపోతే సంబంధిత దీూాను సంప్రదించాలని సూచించారు. ఓటు వేయడానికి ఓటర్ స్లిప్పుతో పాటు ప్రభుత్వం సూచించిన 18 రకాల గుర్తింపు కార్డులలో ఏదో ఒకటి వెంట తీసుకువెళ్లాలని, ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద ఓటర్లకు సహాయం చేయడానికి 'హెల్ప్ డెస్క్'లు అందుబాటులో ఉంటాయన్నారు. యువత, పట్టణ ప్రాంత ఓటర్లు ఓటింగ్ శాతాన్ని పెంచేలా ఉత్సాహంగా పాల్గొనాలని, సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం కల్పించాలని కోరారు.

అనంతరం కార్యక్రమాని హాజరైన ప్రతి ఒక్కరితో ఓటు హక్కు వినియోగం పై కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు శ్యామలాదేవి, రాజేశ్వర్, ఆర్డీఓ స్రవంతి, సేడ్స్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు సురేందర్, సంస్థ ప్రతినిధులు, ప్రజలు, విద్యార్థులు, యువత, శిక్షణార్థులు, తహశీల్దార్లు శ్రీనివాస్, గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల ప్రక్రియలో సూక్ష్మ పరిశీలకుల పాత్ర అత్యంత కీలకం: అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్.





అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి మున్సిపల్ ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో సూక్ష్మ పరిశీలకుల పాత్ర అత్యంత కీలకమని అదనపు కలెక్టర్ రెవెన్యూ కిషోర్ కుమార్ అన్నారు. శుక్రవారం, కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో మైక్రో అబ్జర్వర్లకు రెండవ విడత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మైక్రో అబ్జర్వర్లుగా విధులు నిర్వర్తించే అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. శిక్షణలో, శిక్షకులు అందించే వివరాలను సమగ్రంగా తెలుసుకొని ఎన్నికల్లో విధుల్లో పాల్గొనాలని అన్నారు. సిబ్బందికి సమయపాలన క్రమశిక్షణ అత్యంత కీలకమని గుర్తు చేశారు. బాధ్యతాయుతంగా తమ విధులు నిర్వర్తించి, ఎన్నికల ప్రక్రియను మొత్తం దిగ్విజయంగా పూర్తి చేయాలని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో డీఈవో భోజన్న, ఎల్డీఎం రామ్ గోపాల్, శిక్షకులు, తదితరులు పాల్గొన్నారు.

# సేవకు సంతృప్తి – కృషికి గుర్తింపు

అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి పదవి విరమణ పొందుతున్న హోం గార్డు ను ఘనంగా సత్కరించి వీడుకోలు పలికిన జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్

42 ఏళ్ల సుదీర్ఘ సేవల అనంతరం నేడు పదవి విరమణ పొందుతున్న హోం గార్డు ఎస్‌కే కలీం(ఎ+ 359)ను, జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్, పోలీసు ప్రధాన కార్యాలయంలో ఆయనను ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ...

1984 సంవత్సరంలో హోం గార్డుగా పోలీసు శాఖలో చేరిన ఎస్‌కే కలీం, 42 సంవత్సరాల సుదీర్ఘ కాలం పాటు అంకితభావంతో సేవలు అందించి ఈరోజు పదవీ విరమణ చేశారు.ఎస్‌కే కలీం, పోలీసు శాఖకు అందించిన సేవలను కొనియాడుతూ, విధి నిర్వహణలో ఆయన చూపిన నిబద్ధత, క్రమశిక్షణ, బాధ్యతాయుత సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. అలాగే వారి ఆరోగ్యం, కుటుంబ పరిస్థితి గురించి ఆప్యాయంగా అడిగి తెలుసుకుని, భవిష్యత్తులో మంచి ఆరోగ్యం, శాంతియుత



జీవితం గడపాలని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సన్మాన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ తో పాటు, అడిషనల్ ఎస్పీ ఉపేందర్ రెడ్డి(అడ్మిన్), ఏవో యూనుస్ అలీ, ఆర్ ఐ శేఖర్, ఏ ఆర్.ఎస్ఐ ఉన్నారు.

# మొగిలిపేటలో ఘనంగా జరిగిన శ్రీ లక్ష్మి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు.

## బాధల్లో కూడా బాధ్యతలు మరవని గ్రామస్తులు.







మల్లాపూర్ అమృత్ తెలంగాణ ఫిబ్రవరి 6, మల్లాపూర్ మండలం మొగిలిపేట గ్రామంలో గత రెండు రోజులుగా జరుగుతున్న స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటి రెండు రోజులు గ్రామం కన్నీరు పెట్టుకుని తూ తూ మంత్రంగానే కార్యక్రమాలు జరిపించిన గ్రామం, కొందరు (సదుద్దేశంతోనే) జరపకపోతే కూడా మంచిదే అని వాదనలు వినిపించిన చోట, బాపు సుజిత్ రావు ఆశీర్వాదంతో ,గ్రామ సర్పంచ్ కళారమేష్,ఉపసర్పంచ్ దండేవేని రాజేందర్ ల అండదండలతో, (చిత్రంలో చూడొచ్చు),గ్రామ పెద్దల సహకారంతో, హోమంకాల్చి మంగళ వాయిద్యాల మధ్య ,వేదపండితులు పెళ్లి మంత్రాలు చదవగా గోవిందా గోవిందా అని స్వామి వారి నామస్మరణం చేస్తూ శ్రీ వేంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం వైభవంగా జరిపించి జనని, ఆలయ కమిటి వారు తమ పాత్రకు న్యాయం చేశారని గ్రామస్తులు భావిస్తున్నారు .మహిళలు కొబ్బరి కాయలు కొట్టి స్వామి వారిని భక్తి శ్రద్ధలతో పూజించి స్వామి కృపకు పాత్రులయ్యారు . పూజానంతరం అన్నప్రసాదాలు ఆరగించిన గ్రామస్తులు తిను బండారాల దగ్గర తమకు నచ్చిన పదార్థాలు కొనుక్కోవడం , పిల్లలు దుకాణాల వద్ద ఆట వస్తువులు కొనుక్కోవడం మొత్తానికి సంతృప్తి కరంగానే జరిగినట్టుగా గ్రామస్తులు భావిస్తున్నారు.ఆవిధంగా కృషి చేసిన పెద్ద మనుషులు భేష్.

## ఆదిలాబాద్ శాసనసభ్యులు పాయల్ శంకర్ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదిలాబాద్ పట్టణంలో ఈరోజు వార్డులు 5, 6, 7, 8 లో బీజేపీ కౌన్సిలర్ అభ్యర్థుల తరపున విస్తృతంగా ప్రచారం నిర్వహించారు.





ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న శాసనసభ్యులు పాయల్ శంకర్

అమృత్ తెలంగాణ అదిలాబాద్ న్యూస్ ఈ సందర్భంగా ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ ముఖ్యంగా ఈ అంశాలను ప్రస్తావించారు: ఆదిలాబాద్‌లో ప్రతిపాదిత కొత్త విమానాశ్రయం వల్ల యువతకు ఉద్యోగ అవకాశాలు పెరిగి, ప్రాంత అభివృద్ధి వేగవంతమవుతుందని తెలిపారు.గాంధీ చౌక్, శివాజీ చౌక్ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలను టోపుడు బండ్ల తొలగింపుతో శాశ్వతంగా పరిష్కరించామని తెలిపారు. INC, AIMIM, BRS పార్టీలు కలిసి MIM పార్టీని చైర్మన్ చేయడానికి కుట్ర చేస్తున్నాయని, AIMIM నాయకుడు అసదుద్దీన్ ఒవైసీ స్వయంగా చెప్పారని పేర్కొన్నారు.ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని వధశాల (Slaughter House)ను పట్టణానికి 15 కి.మీ. దూరానికి తరలించామని, ఇప్పుడు కొన్ని పార్టీలు మళ్లీ పట్టణంలోకి తీసుకురావాలని చూస్తున్నాయని విమర్శించారు. గత దీ=హా ప్రభుత్వం, ప్రస్తుతం INC ప్రభుత్వం రైల్వే అండర్ బ్రిడ్జ్ (RUB), ఓవర్ బ్రిడ్జ్ (ROB) పనులకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని విమర్శించారు. తాను కృషి చేసి ఇటీవలే రూ.109 కోట్లు జిల్లా కలెక్టర్ ఖాతాలో జమ చేయించానని చెప్పారు. అర్హులైన పేదలందరికీ ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద ఇళ్లు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. విధవలు, వృద్ధులు తదితరులకు సంబంధించిన పెన్షన్ల పెంపు అంశాన్ని ప్రభుత్వ స్థాయిలో లేవనెత్తానని, వారి సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్నానని తెలిపారు. ప్రస్తుతం ఆదిలాబాద్‌కు ఎమ్మెల్యే ఎంపీ ఉన్నారని, ఇప్పుడు మున్సిపల్ చైర్మన్ పదవిని కూడా గెలుచుకునే చారిత్రాత్మక అవకాశం ఉందని అన్నారు. అందుకే ప్రజలు బీజేపీ కౌన్సిలర్లకు ఓటు వేసి అభివృద్ధికి బాట వేయాలని కోరారు. బీజేపీ నాయకత్వంలోనే ఆదిలాబాద్ పట్టణం అన్ని wards అభివృద్ధి చెందుతుందని, CC roads, drains mariyu శాశ్వత పరిష్కారాలు లభిస్తాయని తెలిపారు. చివరగా, ఆదిలాబాద్ భవిష్యత్తు, యువత ఉద్యోగాలు, మహిళల భద్రత, పేదల సంక్షేమం కోసం బీజేపీకి సంపూర్ణ మద్దతు ఇవ్వాలని పాయల్ శంకర్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో తదితర నాయకులు ప్రజలు పాల్గొన్నారు

## ఎన్నికల ప్రచారంలో సోషల్ మీడియాలో రెచ్చగొట్టే ప్రసంగాలు, పోస్టులపై కఠిన చర్యలు : జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల

అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి : ఎన్నికల ప్రచారం సందర్భంగా సోషల్ మీడియా వేదికగా రెచ్చగొట్టే, విద్వేషపూరిత ప్రసంగాలు చేయడం, వాటిని వైరల్ చేయడం పట్ల కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల హెచ్చరించారు. ఇటీవల సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన ఓ ఘటన నేపథ్యాన్ని దృష్టిలో ఉంచుకొని, పట్టణంలోని ఎంఐఎం వార్డు అభ్యర్థి, నాంపల్లి ఎమ్మెల్యేపై కేసు నమోదు చేసినట్లు ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ తెలిపారు. సోషల్ మీడియా వేదికలైన వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ తదితర గ్రూపుల్లో అసభ్యకరమైన, అవమానకరమైన, విద్వేషపూరిత పోస్టులు, వీడియోలు లేదా వ్యాఖ్యలను ఫార్వర్డ్ చేసిన వారిపై మాత్రమే కాకుండా, అలాంటి విషయాలను ఫార్వర్డ్ చేయడానికి అనుమతించిన గ్రూప్ అడ్మిన్‌లపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ లిడా.జి.జానకి షర్మిల స్పష్టం చేశారు. విద్వేషాలను రెచ్చగొట్టే ప్రసంగాలు చేయడం, వాటిని సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేయడం ద్వారా శాంతిభద్రతలకు భంగం కలిగించే ప్రయత్నాలు చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అదేవిధంగా, సోషల్ మీడియా గ్రూపులు, వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి వేదికలలో ఎవరు అయినా అసభ్యకరమైన, అవమానకరమైన, విద్వేషపూరిత పోస్టులు, వీడియోలు, వ్యాఖ్యలు చేసినా సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ హెచ్చరించారు. జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా మరియు నిష్పక్షపాతంగా జరిగేలా ప్రతి ఒక్కరూ పోలీస్ శాఖకు సహకరించాలని ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ లిడా.జి.జానకి షర్మిల లి ప్రజలను కోరారు.




## మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను చిత్తుగా ఓడించండి

చండూరు :అమృత్ తెలంగాణ: ఫిబ్రవరి 11న జరిగే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను చిత్తుగా ఓడించాలని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ఓటర్లకు పిలుపునిచ్చారు. శుక్రవారం మున్సిపల్ పట్టణంలో పలు వార్డులలో జరిగిన రోడ్ షో లో ఆయన పాల్గొని 4వ వార్డు ఇరిగి వెంకటమ్మ రామన్న, 5వ వార్డు గుండ్రెడ్డి మధుతో కలిసి మల్లన్న గుడి దగ్గర నుండి లేపాక్షి కాలనీ, రాజీవ్ కాలనీ, అంగడిపేట ఎల్లమ్మ గుడి దగ్గర వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం 3వ వార్డు సామ సుజాత యాదవ రెడ్డి, 9వ వార్డు గుంటి పద్మ వెంకటేశంతో కలిసి ఎన్టీఆర్ కాలనీ మీదుగా వినాయక మండపం, తాసీల్దార్ కార్యాలయం పరిసర ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం చేశారు.

10వ వార్డు అభ్యర్థి సతీష్ తో కలిసి కోట మైసమ్మ దేవాలయం నుండి గల్లీలో గడపగడపకు తిరుగుతూ బీఆర్ఎస్ కౌన్సిలర్‌ను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. తాను గత ప్రభుత్వంలో



రూ.30 కోట్లతో అభివృద్ధి పనులు పూర్తిచేస్తే, ఇప్పుడు వచ్చి నేనే లైట్లు వేశా, నేనే రోడ్లు వేశా అని గొప్పలు చెప్పుకుంటూ కొబ్బరికాయ కొట్టుకుంటూ శిలాఫలకాలు వేస్తున్నాడే తప్ప ఎలాంటి అభివృద్ధి చేయని విషయం అందరికీ తెలిసిందేనన్నారు. అమృత్ పథకం కింద తాను మంజూరు చేయించిన రూ.12 కోట్లల్లో ఇంకా రూ.6 కోట్ల నిధులు మున్సిపాలిటీలో మరుగుతున్నట్లు తెలిపారు. ఆ నిధులు విడుదల చేయించి మున్సిపాలిటీ అభివృద్ధి చేసే దమ్ము ధైర్యం లేదన్నారు.

మున్సిపాలిటీలో మిగిలిపోయిన అన్ని పనులను పూర్తి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. కోడి బ్రదర్స్ కు మున్సిపాలిటీ అప్పజెప్పడం కోసం ఆరాట పడుతున్నారని, కోడి బ్రదర్స్ కు పాఠశాలల మీద ఉన్న ప్రేమ మున్సిపల్ అభివృద్ధిపై ఉండదన్నారు. వాళ్ల పాఠశాలల వల్ల ఇక్కడికి మోడల్ స్కూల్ గాని, ఇంటిగ్రేటెడ్ పాఠశాల తేవడం లేదన్నారు. కావున బీఆర్ఎస్ కౌన్సిలర్లను గెలిపించాలని ఆయన కోరారు.

ఈ కార్యక్రమంలో చండూరు మున్సిపాలిటీ మాజీ చైర్మన్ తోకల చంద్రకళ వెంకన్న, ఇరిగి రామకృష్ణ, నకిరికంటి రామలింగం, చొప్పరి దశరథ, బూతురాజు వెంకన్న, బొమ్మరబోయిన వెంకన్న, మాజీ అధ్యక్షుడు పెదగొని వెంకన్న గౌడ్, పట్టణ మహిళా అధ్యక్షురాలు సంగేపు సువర్ణ, మండల మహిళా అధ్యక్షురాలు పెండ్యాల గీత, గోపిడి వెంకట్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## గల్ఫ్ కార్మికుల భూసమస్యలు పరిష్కరించాలి, Mro కు వినతి పత్రం

మల్లాపూర్ అమృత్ తెలంగాణ ఫిబ్రవరి 6 మల్లాపూర్ మండలం లోని గ్రామాల రైతులు గత సంవత్సరాలుగా భూములు అనుభవిస్తున్నాం కానీ మాకు ప్రభుత్వం ఇప్పటి వరకు పట్టాలు కల్పించడం లేదని ,గతంలో కూడా వచ్చిన ప్రతి mroకుఅర్జీ పెట్టుకున్నాతాము గల్ఫ్ లో ఉన్నా ,స్థానికంగా ఉన్న భూసమస్యలు పరిష్కారం కబడలేదని రైతులు వాపోతున్నారు .తాజాగా మల్లాపూర్ మండలం వీవీ రావు పేట లో భూసమస్యలు పరిష్కరించాలని గ్రామానికి చెందిన రైతులు చాలామంది ఉన్నారని వారి సమస్యలు తీర్చాలని గల్ఫ్ సంఘం అధ్యక్షుడు అశోక్, తహసీల్దార్ కి వినతి పత్రం అందజేశారు 50 సంవత్సరాలుగా సాగుచేసుకుంటున్నా 65,370,386,389 సర్వే నంబర్ గల మొదలగు భూములకు




పట్టాలిచ్చి సమస్య పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు

## గుప్త నిధుల పేరుతో మోసాల గుట్టురట్టు.

నకిలీ బాబా అతని గ్యాంగ్ మొత్తం ఏడుగురు సభ్యులు అరెస్ట్.
బాబా మరియు అతని గ్యాంగ్ పై ఇప్పటివరకు జిల్లాలో 12 కేసులు నమోదు.
ఇప్పటివరకు జిల్లాలో 26 మంది వద్ద నుండి రూ కోటి పైగా వసూలు చేసిన దుండగులు.
నిందితుల వద్ద నుండి ఒక కారు, ఒక బైకు , ఏడు మొబైల్ ఫోన్స్,
నకిలీ బంగారు నాణేలు, కుండలు పూజకు ఉపయోగించిన బట్టలు స్వాధీనం.
గుప్తనిధుల పేరు పై గుడ్డిగా డబ్బులు ఇచ్చి మోసపోయిన బాధితులు.
జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్.



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి

నిందితుల వివరాలు

A1. దర్శనాల రాజ్‌కుమార్ ఏ దర్శనాల రాజు, తండ్రి: అశోక్, వయస్సు: 23 సం., నివాసం: పిప్పల్కోటి గ్రామం, భీమ్పూర్ మండలం, ఆదిలాబాద్ జిల్లా.

A2. అర్ధంగి మహేందర్, తండ్రి: చిన్న భూమన్న, వయస్సు: 35 సం., నివాసం: ఘోట్కూరి గ్రామం, తాంసి మండలం, ఆదిలాబాద్ జిల్లా.

A3. బలేవర్ నవీన్, తండ్రి: మధుకర్, వయస్సు: 24 సం., నివాసం: పిప్పల్కోటి గ్రామం, భీమ్పూర్ మండలం, ఆదిలాబాద్ జిల్లా.

A4. రింగన్ కిరణ్, నివాసం: పిప్పల్కోటి గ్రామం, భీమ్పూర్ మండలం, ఆదిలాబాద్ జిల్లా.

A5. ఏటి శ్యామ్, నివాసం: పిప్పల్కోటి గ్రామం, భీమ్పూర్ మండలం, ఆదిలాబాద్ జిల్లా.

A6. కదిరి అఖిల్, నివాసం: పిప్పల్కోటి గ్రామం, భీమ్పూర్ మండలం, ఆదిలాబాద్ జిల్లా.

A7. ధోనిపెల్లి అరుణ్ కుమార్, నివాసం: పిప్పల్కోటి గ్రామం, భీమ్పూర్ మండలం, ఆదిలాబాద్ జిల్లా.

వివరాలలో

స్థానిక పోలీసు హెడ్ క్వార్టర్స్ సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన పత్రిక సమావేశంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ వివరాలను వెల్లడిస్తూ,

భీంపూర్ పోలీస్ స్టేషన్ పరదీలోని పిప్పలకోటి గ్రామానికి చెందిన ప్రధాన నిందితుడు దర్శనల రాజ్ కుమార్ అను వ్యక్తి గత మూడు సంవత్సరాల క్రితం తనకు దేవర వస్తుందని, తనకు మంత్ర శక్తి ఉందని చుట్టూ పక్కల గ్రామాల వారిని నమ్మించినాడు. ప్రజలు అతనిని నమ్మి అతని వద్ద వచ్చి తమ బాదలను, కష్ట సుఖలను చెప్పేవారు, వారికి తన మంత్ర శక్తి ద్వారా కష్టాలను దూరం చేస్తానని నమ్మించడం తో చాలామంది పరిచయం అయ్యారు. అదే క్రమంలో కొంతమందితో అతను, నేను మంత్ర శక్తి ద్వారా బంగారం తవ్విస్తాను, అని నమ్మించి వారినుండి ఇష్టం వచ్చినట్టు డబ్బులు తీసుకొని అతని బావ మహేందర్ మరియు మిత్రులు నవీన్, అరుణ్, శ్యామ్, అఖిల్ మరియు కిరణ్ లతో కలిసి పథకం ప్రకారం గుప్త నిధులు ఉన్నాయంటూ చెప్పిన వారి ఇంటికి వెళ్ళి అతని మిత్రుల సాయంతో గుంతను తవ్వించి అందులో నుండి తనతో ముందుగా తీసుకొచ్చిన కుండలో మట్టి మరియు ఆన్లైన్ ఫ్లిప్కార్ట్ కార్డ్ ద్వారా ఆర్డర్ చేసిన నకిలీ నాణేలు కుండలో పెట్టి, ఆ కుండను తవ్వకం లో వెళ్ళినట్టు సృష్టించి దూరం నుండి నకిలీ నాణేలు చూపెట్టి, నమ్మించి తర్వాత ఒక ఎర్రని బట్టతో అట్టి కుండను చుట్టి దానికి 41 రోజులు దాన్ని ముట్టకుండా, పూజలు చేయాలని తర్వాతా అతను వచ్చి తీసిస్తానీ చెప్పి నమ్మించి డబ్బులు తీస్కొని పారిపోయేవాడు. ముందే పూజ చేసిన బిందెతీస్తే తీసిన వారు చనిపోతారని భయపెట్టి వెళ్తారు ఆ విదంగా నేరస్థుడు దర్శనల రాజు తన మిత్రులైన నవీన్, అరుణ్, శ్యామ్ అఖిల్ మరియు కిరణ్ మరియు బావ మహేందర్ లతో కలిసి మొత్తం 26 మంది వద్ద నుండి రూ.1,03,80,000 (ఒక కోటి మూడు లక్షల ఎనభై వేలు ) తీసుకొని మోసాగించినడాని ఇప్పుడు వరకు చేసిన దర్యాప్తులో తేలింది.

ఇప్పటికీ వీరిపై జిల్లాలోని
బీంపూర్ పోలీస్ స్టేషన్ నందు 6,
మావల పోలీస్ స్టేషన్లో ఒకటి,
నేరడిగొండ పోలీస్ స్టేషన్లో ఒకటి,
బోథ్ పోలీస్ స్టేషన్ నందు రెండు,
రూరల్ పోలీస్ స్టేషన్ నందు ఒకటి,
జైనథ్ పోలీస్ స్టేషన్ నందు ఒకటి,
మొత్తం 12 కేసులు నమోదు అయ్యాయి

ఇంకా దర్యాప్తు కొనసాగుతుందని వీరి ద్వారా మోసపోయిన బాధితులు ఇంకా ఎవరైనా ఉన్నట్లయితే నిర్భయంగా జిల్లా పోలీసులను సంప్రదించవచ్చని తెలిపారు. డబ్బులు ఊరికే రావని ఇలాంటి నకిలీ బాబాలను నమ్మి ప్రజలు డబ్బులను వేచించకూడదని సూచించారు. నిందితుల వద్ద నుండి ఒక షిఫ్ట్ డిజైర్ కారు, ఒక బైకు, 7 మొబైల్ ఫోన్లను, గుప్త నిధుల పేరుతో మోసం చేసిన నకిలీ బంగారు నాణాలు కుండలు పలు బట్టలు స్వాధీనం చేసుకున్నట్లు తెలియజేశారు. కేసును చేదించడంలో కీలక పాత్ర పోషించిన జైనథ్ సిఐ, బీంపూర్ ఎస్సై మరియు సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి, సిఐలు జి శ్రావణ్, ఎస్సై విక్రమ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మోసపోయిన బాధితుల వివరాలు (పేర్లు -- మొత్తం):

1. మద్దెల దయాకర్, బుద్ధికొండ గ్రామం (నెర్డిగొండ మండలం) -- రూ.6,00,000/-
2. ముక్కెర తేజ, తాంసి (కే) భీంపూర్ మండలం -- రూ.4,00,000/-
3. మస్కరి అనిల్, పిప్పల్కోటి -- రూ.5,00,000/-
4. కరే పవన్ కళ్యాణ్, నిపాణి -- రూ.4,50,000/-
5. కదిరి రమాకాంత్, పిప్పల్కోటి గ్రామం -- రూ.5,00,000/-
6. కదిరి నవీన్, పిప్పల్కోటి గ్రామం -- రూ.4,00,000/-
7. గాలిపల్లి నర్సింగ్, మావల -- రూ.5,00,000/-
8. సంగెపు వెంకటరమణ, బుద్ధికొండ గ్రామం (నెర్డిగొండ మండలం) -- రూ.6,00,000/-
9. నల్ల అరుణ్ కుమార్, కౌట (బి) బోథ్ మండలం -- రూ.3,00,000/-
10. ఉదయ్ కుమార్ జొన్నాల, కౌట (బి) బోథ్ -- రూ.6,50,000/-
11. కార్తిక్ ఇప్ప, భీమ్సారి గ్రామం (ఆదిలాబాద్ రూరల్) -- రూ.6,00,000/-
12. గుమ్మడి గణేష్, మెడిగూడ గ్రామం (జైనాథ్) -- రూ.4,00,000/-
13. గోదాల లక్ష్మి, పిప్పల్కోటి -- రూ.4,00,000/-
14. గసుగంటి అమ్మి, పిప్పల్కోటి -- రూ.3,00,000/-
15. దోనిపెల్లి దేవన్న, పిప్పల్కోటి -- రూ.3,00,000/-
16. శ్రీకాంత్, వడ్డాడ -- రూ.6,00,000/-
17. రాజయ్య, నిర్మల్ -- రూ.5,20,000/-
18. పెడింటి అశోక్, అంతర్గావ్ -- రూ.3,00,000/-
19. రొడ్డ సతీష్, శాంతినగర్ ఆదిలాబాద్ -- రూ.2,00,000/-
20. ప్రవీణ్, జైనాథ్ -- రూ.6,00,000/-
21. అశన్న, భరంపూర్ -- రూ.1,00,000/-
22. రమేష్, కప్పర్ల -- రూ.1,60,000/-
23. అశన్న, కొక్నూర్ -- రూ.1,00,000/-
24. తరుణ్, లకర్వాడ -- రూ.3,00,000/-
25. కృష్ణ, ఆదిలాబాద్ -- రూ.1,00,000/-
26. చింటూ, జమ్డాపూర్ -- రూ.5,00,000/-

మొత్తం మోసపోయిన డబ్బు: రూ.1,03,80,000/- (ఒక కోటి మూడు లక్షల ఎనభై వేల రూపాయలు)

## పశువులకు వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి: డా. శివరాజ్

మిడ్జిల్ :అమృత్ తెలంగాణ: సీజన్లో పశువులకు ,మేకలకు, గొర్లకు, ఆవులకు, గేదెలకు, వచ్చే వ్యాధులపై రైతులు అప్రమత్తంగా ఉండాలని పశు వైద్య డాక్టర్ శివరాజ్ చెప్పారు. గర్భకోశ వ్యాధి నివారణ పరీక్షలు పై మండలంలోని ఈదులబాయ్ తాండ గ్రామపంచాయతీలో ఉచిత పశువైద్య శిబిరంలో గర్భకోశ వ్యాధుల నివారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సందర్భంగా సర్పంచ్ ధర్మానాయక్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో డాక్టర్ శివరాజ్ మాట్లాడుతూ.. పశు వైద్య పశు సంవర్ధక శాఖ, పశుగణాభివృద్ధి సంస్థ సంయుక్తంగా నిర్వహించి 94 పాడి పశువులకు చికిత్సలు, 45 దూడలకు నటల నివారణ మందులు పంపిణీ చేశామని ఆయన తెలిపారు. రైతులు ప్రభుత్వం నుంచి వస్తున్న సస్పిడి గడ్డి విత్తనాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో పశు వైద్య సిబ్బందికి సాల్వ పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విజయ డైరీ ప్రెసిడెంట్ రవి నాయక్ గోపాల్ మిత్ర సూపర్వైజర్ రవి, పశువైద్య సిబ్బంది ,శ్రీనివాస్, సత్యం, గోపాల మిత్రులు యాదగిరి, నర్సింలు, మల్లేష్, వేణుగోపాల్, పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రశ్నించే గొంతు.. మొరిగాడి భాగ్యలక్ష్మిని గెలిపించాలి





ఆలేరు రూరల్ .అమృత్ తెలంగాణ: ఆలేరు మున్సిపాలిటీలో రానున్న ఎన్నికల్లో 4వ వార్డ్ సీపీఐ (ఎం) అభ్యర్థి మొరిగాడి భాగ్యలక్ష్మి అజయ్‌ను గెలిపించాలని సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆలేరు మున్సిపల్ 4వ వార్డులో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొని ఇంటింటికి తిరిగి ఓటర్లను కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే,ప్రజల తరఫున ప్రశ్నించే గొంతుకగా నిలిచే మొరిగాడి భాగ్యలక్ష్మి అజయ్‌ను సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

సీపీఐ (ఎం) ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎప్పుడూ ముందుండి పోరాటాలు చేస్తోందని తెలిపారు. ముఖ్యంగా ఈ ప్రాంతంలో ఇల్లు లేని పేదల కోసం ఇళ్ల స్థలాల పోరాటాలు నిర్వహించి వందల మందికి ఇళ్ల స్థలాలు ఇప్పించడంలో సీపీఐ (ఎం) కీలక పాత్ర పోషించిందని గుర్తు చేశారు. పోరాట వారసత్వం కలిగిన అభ్యర్థిని గెలిపిస్తే మున్సిపల్ పాలకవర్గంలో ప్రజల తరఫున నిలబడి ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడతారని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులను పరిశీలించినప్పుడు ప్రజల కోసం పనిచేసే, ప్రజా సమస్యలపై అవగాహన ఉన్నవారినే గెలిపించుకోవాలని పలువురు ఓటర్లు ప్రచారంలో జహంగీర్ దృష్టికి తీసుకువచ్చారు.

స్పందించిన జహంగీర్ గత పాలకవర్గంలో కమ్యూనిస్టుల ప్రాతినిధ్యం లేకపోవడం వల్ల ప్రజలకు నష్టం జరిగిందని అన్నారు. అందుకే రానున్న ఎన్నికల్లో 11 వార్డులలో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇస్తూ,నాలుగో వార్డులో మాత్రమే సీపీఐ (ఎం) పోటీ చేస్తోందని వివరించారు.కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కూడా పెద్ద మనసుతో ఆలోచించి ప్రజా పోరాటాలకు మద్దతుగా నిలిచి సీపీఐ (ఎం) అభ్యర్థి మొరిగాడి భాగ్యలక్ష్మి అజయ్‌ను గెలిపించాలన్నారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎం) జిల్లా నాయకులు ఎంఏ ఇక్బాల్,మండల కార్యదర్శి దూపటి వెంకటేష్,మొరిగాడి రమేష్,జూకంటి పౌలు,సూదగాని సత్య రాజయ్య,సంగి రాజు, నల్లమాస తులసయ్య,పిక్క గణేష్,వడ్డేమాన్ బాలరాజు,గణగాని మల్లేశం,తాళ్లపల్లి గణేష్,బొప్పిడి యాదగిరి,చెన్న రాజేష్,కాసుల నరేష్,మొరిగాడి పుష్ప,స్వరూప, చంద్రకళ,ఘణగాని భాగ్యమ్మ,అయిలి అంజమ్మ,మొరిగాడి మంజుల,అనిత,హర్షిత,యాసారపు ప్రసాద్,ఎండి మతిన్,ఎండి అఖిల్, పిఎన్ఎం కళాకారులు బిక్షపతి,శ్రీమాన్,బాబు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# విద్యా రంగానికి పెద్దపీట : ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్



ముధోల్ :అమృత్ తెలంగాణ: ముధోల్ నియోజకవర్గంలో విద్యారంగంకు పెద్ద పీట వేస్తున్నానని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. మండలంలోని బ్రహ్మన్ గావ్ గ్రామంలో శుక్రవారం రూ.40 లక్షల నిధులతో పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి, అలాగే మహిళా సమైక్య సంఘ భవన నిర్మాణానికి రూ.10 లక్షల నిధులతో శుక్రవారం భూమి పూజ చేశారు. అలాగే గన్నోర గ్రామంలో రూ.40 లక్షల నిధులతో పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి, ఎడ్ బిడ్ గ్రామంలో మహిళా సమైక్య సంఘ భవన నిర్మాణానికి రూ.10 లక్షల నిధులతో భూమి పూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన వేర్వేరు సమావేశంలోఎమ్మెల్యే మాట్లాడారు. పాఠశాలల్లో విద్యార్థులకు భద్రత లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ప్రహరీ గోడ నిర్మాణంతో వారికి పూర్తి రక్షణకు తోడ్పడుతుందని అన్నారు. మహిళా సమైక్య సంఘ భవనాల ద్వారా మహిళలు ఆర్థికంగా, సామాజికంగా అన్ని రంగాల్లో రాణించటానికి వేదికలన్నారు. గ్రామాల సమగ్ర అభివృద్ధే తమ లక్ష్యమని, విద్యా రంగం ,మహిళా సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో సూపర్డెంట్ అశోక్, ఎటిఎం గురుచరణ్, ఎపిఓ శిరీషారెడ్డి, పంచాయతీ కార్యదర్శి లు శివరెడ్డి, రాజు, సర్పంచుల అప్పల రాజు, రాంచందర్ రెడ్డి, మౌనిక మహేందర్ రెడ్డి, మండల నాయకులు, తదితరులు అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# చందుపట్ల పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన డిఆర్ఓ



భువనగిరి: విద్యార్థులు రాబోయే పరీక్షలను దృష్టిలో ఉంచుకొని ఒక ప్రణాళిక వేసుకొని కష్టపడి చదవాలని జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ అన్నారు. శుక్రవారం భువనగిరి మండలం చందుపట్ల గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలను జిల్లా రెవెన్యూ అధికారి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ.. పాఠశాలలో విద్యార్థుల హాజరు, బోధన విధానం, పరీక్షల సన్నద్ధత పై విద్యార్థులను వారి తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు.

విద్యార్థులతో ముఖ్యంగా ' సి ' కేటగిరీ విద్యార్థులతో ప్రత్యేకంగా సమావేశమై వారికి రాబోయే పరీక్షలను దృష్టిలో ఉంచుకుని ప్రణాళికాబద్ధంగా చదవాలని, వెనుకబడిన సబ్జెక్టులను ప్రతిరోజు ఒకటికి రెండుసార్లు చదవాలని సూచించారు. కష్టపడి చదివితే మంచి ఉత్తీర్ణత ఫలితాలు సాధించవచ్చని ప్రోత్సహించారు.అలాగే విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు సి క్యాటగిరి విద్యార్థుల పై మరింత దృష్టి పెట్టి ఫలితాలను మెరుగుపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ప్రతిభని వెలికి తీసేందుకే క్రీడా పోటీలు..



ముధోల్ :అమృత్ తెలంగాణ: సీఎం కప్ క్రిడా పోటీలు క్రీడాకారులలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఈ క్రీడా పోటీలు దోహదపడతాయని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనందరావు పటేల్ లు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఆవరణలో నియోజకవర్గ స్థాయిలో జరిగే సీఎం క్రీడా పోటీలకు ముఖ్యఅథితి లుగా హాజరై వారు మాట్లాడారు.. గ్రామాల్లో ఎంతోమంది ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఎందరో ఉన్నారని, ప్రతిభను చాటెందుకు సీఎం క్రీడ పోటీలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముధోల్ నియోజకవర్గ ములోని ఆయా గ్రామాల క్రీడాకారులు, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించి విద్యార్థులు మంచి గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ పోటీలు గురువారం నాటికి ముగియనున్నాయి. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీడీవో లవ కుమార్, ముధోల్ సర్పంచ్ షబానా బేగం, ఉపసర్పంచ్ లావణ్య , బాసర ఎంపీడీవో దేవేందర్ రెడ్డి ఎంఈఓరమణారెడ్డి, ఎంపీఓచంద్రశేఖర్, పిడి శ్రీనివాస్ సూపరిండెంట్ అశోక్ తో పాటు నియోజక వర్గంలోని పాల్గొన్నారు.

# జాన్వీకపూర్ కి మళ్లీ షాక్ ఇచ్చిన యూనిట్!



ఆ సినిమా విడుదల వాయిదాతో జాన్వీ కపూర్ ఇబ్బంది పడుతోందా? కొత్త ఏడాది ఆరంభంలోనే అమ్మడికి ఇక్కట్లు తప్పడం లేదా? అంటే సన్నివేశం అలాగే కనిపిస్తోంది ఆ సినిమా విడుదల వాయిదాతో జాన్వీ కపూర్ ఇబ్బంది పడుతోందా? కొత్త ఏడాది ఆరంభంలోనే అమ్మడికి ఇక్కట్లు తప్పడం లేదా? అంటే సన్నివేశం అలాగే కనిపిస్తోంది. ప్రస్తుతం జాన్వీ కపూర్ లో బాలీవుడ్ లో 'పరమ్ సుందరి', 'సన్నీ సంస్కారీకి తులసీ కుమారీ'లో నటిస్తోంది. వీటితో పాటు తెలుగులో రామ్ చరణ్ హీరోగా నటిస్తోన్న 16వ చిత్రంలోనూ నటిస్తోంది. అయితే ఏప్రిల్ లో రిలీజ్ కావాల్సిన 'సన్నీ సంస్కారి కీ తులసి కుమారీ' మరోసారి వాయిదా పడింది. అనుకున్న టైమ్ లో షూటింగ్ పూర్తి కాకపోవడంతో వాయిదా వేసారు. ఈ సినిమా ఇంకా 25 రోజులు షూటింగ్ పూర్తి చేయాల్సి ఉంది. దీంతో ఈ సినిమా ఎప్పుడు షూటింగ్ పూర్తవుతుంది? ఎప్పుడు రిలీజ్ అవుతుంది? అన్న దానిపై మరోసారి నీలి నీడలు కమ్ముకున్నాయి. అయితే ఈ సినిమా ఇలా వాయిదా పడటం కారణంగా జాన్వీ కి ఇతర సినిమాలతో డేట్లు క్లాష్ అవుతున్నాయట. ముఖ్యంగా రామ్ చరణ్ తో నటిస్తోన్న సినిమా షూటింగ్ కి అంతరాయం ఏర్పడుతుందట. జాన్వీ కపూర్ 25 రోజుల్లో 15 రోజుల పాటు కంటున్యూగా షూటింగ్ కి హాజరవ్వాల్సి ఉందట. అయితే చరణ్ సినిమాకి కేటాయించిన డేట్లలోనే ఈ 15 రోజులు కూడా క్లాష్ కి వస్తున్నాయట. దీంతో జాన్వీ కపూర్ కి ఏం చేయాలో అర్దం కాని సందిగ్ధంలో పడిందంటున్నారు. ఒకే సమయంలో ముంబై టూ హైదరాబాద్ తిరగడం సాధ్యం పడదు. రెండు సినిమాల షూటింగ్ ఒకే చోట అయితే ఇబ్బంది ఉండదు 'సన్నీ సంస్కారీ కి తులసీ కుమారి' షూటింగ్ లను ఇప్పటివరకూ అలాగే బ్యాలెన్స్ చేసుకుంటూ వచ్చింది. కానీ రామ్ చరణ్ సినిమా షూటింగ్ హైదరాబాద్ లో జరుగుతుంది కాబట్టి వీలు పడదు. ఈ నేపథ్యంలో డేట్లు క్లాష్ అవ్వకుండా చరణ్ మేకర్స్ నో, హిందీ సినిమా వాళ్లనే సర్దుబాటు చేయమని అడగాల్సిన పరిస్థితి. డిలే కారణంగా వాయిదా వేసారు కాబట్టి ఈ విషయంలో బాలీవుడ్ మేకర్సే వెనక్కి తగ్గాల్సి ఉంటుంది. ఇప్పటికే చరణ్ సినిమాకి సంబంధించి జాన్వీ షెడ్యూల్ ఫిక్స్ అయింది.

# టెంపర్ బ్యూటీ మరణ వార్తలు.. అసలు మ్యాటర్ ఇదే!




నోరా ఫతేహి గురించి తెలుసుకునేందుకు చాలా మంది ఆమెను సోషల్ మీడియా ద్వారా పలకరించారు. పుట్టిన రోజు వేడుకల్లో భాగంగా బంగీ జంపింగ్ చేసేందుకు ప్రయత్నించిన నోరా ఫతేహి ప్రమాదవశాత్తు మరణించింది అంటూ సోషల్ మీడియాలో పుకార్లు వచ్చాయి. అందుకు సంబంధించిన ఒక వీడియో సైతం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. అడవిలో చేసిన ఆ జంపింగ్ సమయంలో ప్రమాదం జరిగి మహిళ కింద పడ్డట్టుగా వీడియోలో ఉంది. ఆ వీడియోలో ఉన్న వ్యక్తి నోరా ఫతేహి అన్నట్లు అనిపిస్తుంది. దాంతో ఆమె ఫ్యాన్స్‌తో పాటు నెటిజన్స్ అంతా షాక్ అయ్యారు. నోరా ఫతేహి గురించి తెలుసుకునేందుకు చాలా మంది ఆమెను సోషల్ మీడియా ద్వారా పలకరించారు దుల్లగొడుతున్నాం ప్రమాదం జరిగినట్లు చూపించిన వీడియో మార్ఫింగ్ అయ్యి ఉంటుందని మొదటి నుంచి కొందరు అంటున్నా, అలా చేయాల్సిన అవసరం ఎవరికి ఉందని కొందరు ఆందోళన వ్యక్తం చేశారు. మొత్తంగా ఎన్టీఆర్ టెంపర్ సినిమాలో ఐటెం సాంగ్ చేసి తెలుగు ప్రేక్షకులకు సైతం సుపరిచితురాలైన బాలీవుడ్ బ్యూటీ నోరా ఫతేహి చనిపోయిందనే వార్తలు ప్రముఖంగా వచ్చాయి. కొన్ని గంటల్లోనే వార్తలు దావానంలా వ్యాప్తి చెందడంతో వెంటనే ఆమె టీం స్పందించింది. సోషల్ మీడియాలో వస్తున్న వార్తలను నమ్మవద్దు అంటూ వారు పేర్కొన్నారు. ఆ వీడియోలో ఉన్నది నోరా కాదని వారు క్లారిటీ ఇచ్చారు. ప్రస్తుతం నోరా ఫతేహీ తన పుట్టిన రోజు వేడుకలను జరుపుకుంటుంది. సోషల్ మీడియా ద్వారా తన పుట్టిన రోజుకు సంబంధించిన ఫోటోలను వీడియోలను షేర్ చేస్తూ వచ్చింది. దాంతో సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం నిజం కాదని మరోసారి క్లారిటీ వచ్చింది. కొందరు కావాలని ఆ వీడియోను మార్ఫింగ్ చేశారని, అలాంటి పనులు చేయడం ద్వారా సెలబ్రెటీల అటెన్షన్ దక్కించుకోవచ్చు అని భావిస్తున్నారేమో. కానీ పుకార్లను వ్యాప్తి చెందించడం ద్వారా సదరు సెలబ్రెటీ ఫ్యాన్స్, సన్నిహితులు ఎంతో ఆందోళనకు గురి అవుతారనే విషయాన్ని గుర్తించాల్సిన అవసరం ఉంది కెనడాలోని టొరంటోలో పుట్టిన నోరా ఫతేహి బాలీవుడ్‌లో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చి సక్సెస్‌లను దక్కించుకుంది. మొరాకో సంతతికి చెందిన ఫ్యామిలీలో పుట్టిన నోరా ఫతేహి యార్క్ విశ్వవిద్యాలయంలో రాజకీయ శాస్త్రంలో అంతర్జాతీయ సంబంధాలను అభ్యసించి గ్రాడ్యుయేషన్ దక్కించుకుంది. బాలీవుడ్‌లో సినిమాలతో అలరించిన నోరా చాలా సార్లు తాను భారతీయురాలిని అనే భావన కలుగుతుందని చెప్పుకొచ్చింది. బిగ్ బాస్ 9లో పాల్గొనడం ద్వారా పాపులారిటీని సొంతం చేసుకుంది. ప్రస్తుతం కాంచన 4 సినిమాతో పాటు మరో రెండు మూడు సినిమాల్లో నటిస్తోంది. తెలుగు ప్రేక్షకులకు ఐటెం సాంగ్స్‌తో చేరువ అయిన నోరా ఫతేహీ టాలీవుడ్‌లో ముందు ముందు మరిన్ని సినిమాల్లో నటించాలని కోరుకుంటున్నట్లు చెప్పుకొచ్చింది.

# చెప్పుతో కొట్టాల్సింది.. 'దంగల్' నటికి నిర్మాత సలహా!

అయితే టాలీవుడ్ లో కాస్టింగ్ ఏజెంట్లు 'ఏదైనా చేయడానికి సిద్ధంగా ఉన్నావా?' అని పదే పదే రెచ్చగొట్టారని ఫాతిమా వ్యాఖ్యానించారు. 'దంగల్' ఫేం ఫాతిమా సనా షేక్ దక్షిణాదిన తనకు కాస్టింగ్ కౌచ్ ఎదురైందని వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. అయితే ఆ సమయంలో నిర్మాతను చెప్పుతో కొట్టాల్సిందని తెలుగు నిర్మాత ముత్యాల రాందాస్ అన్నారు. కమిట్‌మెంట్ అడిగిన నిర్మాతను నిలదీయాల్సిందని, చెప్పుతో కొట్టి, ఆ తర్వాత వేధింపుల నిరోధక కమిటీకి ఫిర్యాదు చేసి ఉండాల్సిందని రాందాస్ అన్నారు. తెలుగు సినీపరిశ్రమలో లైంగిక వేధింపుల అంశంలో బాధితుల తరఫున కమిటీలు పని చేస్తున్నాయని కూడా ముత్యాల రాందాస్ తెలిపారు. ఆమిర్ ఖాన్ 'దంగల్' చిత్రంతో ఆరంగేట్రం చేసిన ఫాతిమా సనా షేక్, టాలీవుడ్‌లో కాస్టింగ్ కౌచ్ గురించి కొన్ని సంచలన వ్యాఖ్యలు చేసారు. ఫాతిమా బాలీవుడ్ బబుల్ తో మాట్లాడుతున్న ఇంటర్వ్యూ క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయింది. దక్షిణాదిన నిర్మాతలు, కాస్టింగ్ ఏజెంట్లతో తన అనుభవాలను షేర్ చేసుకుంది. తాను బాలీవుడ్ లో అడుగుపెట్టక ముందు అవకాశాల కోసం తొలిగా దక్షిణాదిన ప్రయత్నించానని, అక్కడ నటిస్తే బాలీవుడ్ లో అవకాశాలు సులువుగా వస్తాయని ఆశించానని ఫాతిమా అన్నారు. మరో మసాలా సినిమాకి సీక్వెల్! అయితే టాలీవుడ్ లో కాస్టింగ్ ఏజెంట్లు 'ఏదైనా చేయడానికి సిద్ధంగా ఉన్నావా?' అని పదే పదే రెచ్చగొట్టారని ఫాతిమా వ్యాఖ్యానించారు. నేను కష్టపడి పనిచేస్తానని, పాత్రకు అవసరమైనది చేస్తానని వారికి చెప్పానని తెలిపింది. అయినా కాస్టింగ్ ఏజెంట్ పదే పదే అదే విషయం రిపీట్ చేసాడు. నేను మూగదానిని అయిపోయాను అని ఫాతిమా అన్నారు. హైదరాబాద్ లో పెద్ద, చిన్న నిర్మాతలు కాస్టింగ్ కౌచ్ గురించి చాలా బహిరంగంగా మాట్లాడుతారని తెలిపింది.

## అమృత్ తెలంగాణ సినిమా వార్తలు

# నేను ఇడ్లీ బ్యూటీని..మూడు పూటలైనా నో ప్రోబ్లమ్!



సంవత్సరాలుగా సినిమాలు సెట్స్ లో షూటింగ్ దశలోనే ఉన్నాయి. నిధి అగర్వాల్ కెరీర్ లో నెమ్మదిగా సాగుతోన్న సంగతి తెలిసిందే. చెప్పుకోవడానికి చేతిలో 'హరి హర వీరమల్లు', 'రాజాసాబ్' లాంటి అగ్ర హీరోల చిత్రాలున్నా? వాటి రిలీజ్ విషయానికి వచ్చే సరికే ఏం చెప్పాలో తెలియని పరిస్థితి. సంవత్సరాలుగా సినిమాలు సెట్స్ లో షూటింగ్ దశలోనే ఉన్నాయి. ఆ ప్రాజెక్ట్ లపై నిధి చాలా ఆశలు పెట్టుకుంది. వాటితో సక్సెస్ అందుకుని బిజీ భామగా మారాలని చూస్తోంది. మరి ఈ ప్రయత్నం ఎంత వరకూ సక్సెస్ అవుతుందో చూడాలి. ఏం జరుగుతుంది? రెండు సినిమాలపై అంచనాలైతే భారీగా ఉన్నాయి. సక్సెస్ అయితే నిధి కి కలిసొచ్చే అవకాశాలు ఎక్కువ గానే ఉన్నాయి. ఆ సంగతి పక్కన బెడితే తాజాగా నిధి అగర్వాల్ కి ఇడ్లీ అంటే ఎంత ఇష్టమో ఎంత ఇష్టమో బయటకు వచ్చింది. ఆహార పదార్థాల్లో ఏది ఇష్టం అంటే? అమ్మడు వెంటనే ఇడ్లీ అని సమాధానం ఇచ్చింది. ఇడ్లీ ఉదయమే కాదు..మధ్యాహ్నం లంచ్ లో ...రాత్రి డిన్నర్ లో పెట్టినా ఇష్టంగా ఆరగిస్తుందిట. ఇంట్లో ఇడ్లీ ఉంటే ఇంకే పదార్థాలు అవసరం లేదుట. మూడు పూటలు ఇడ్లీ తినేసి సంతోషంగా ఉంటానంటోంది. సాధారణంగా ఇడ్లీ అంటే చాలా మంది ఇష్టడరు. కానీ నిధి అగర్వాల్ మాత్రం అలాంటి వాళ్లకు భిన్నం అంటోంది. ఇడ్లీ ఆరోగ్యానికి మంచిదంటోంది. ఇడ్లీ ఎక్కడ చూసినా నోరూరిపోతుందిట. ఇడ్లీ తర్వాత ఫ్రెంచ్ ఫ్రైస్ వీక్ నెస్ గా చెప్పుకొచ్చింది. డైటింగ్ వల్ల వాటికి దూరంగా ఉండాల్సి వచ్చినప్పుడు చాలా బాధపడుతుందిట.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com